
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

బుధవారం 13 మార్చి 2024



రంజాన్ వేళలు

బుధవారం ఇఫ్తార్ 6:31

గురువారం సహర్ 5:04





నార్సింగ్ మండలం నర్సంపల్లిలో ఎండిన పొలంలో మేస్తున్న మేకలు

ఎండుతున్న పంటలు..
కూలుతున్న ఆశలు
పశువుల మేతగా పొలాలు

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎండిపోవడంతో రైతన్న పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చేగుంట, నార్సింగ్ మండలాల్లో వెయ్యి ఎకరాల్లో పొట్టకు వచ్చిన దశలో ఉన్న వరి, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లలో నీరు రాక భూములు బీడువారుతున్నాయి. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలనే తాపత్రయంతో పలువురు రైతులు బోర్లు వేయిస్తున్నారు. 500 ఫీట్ల వరకు తవ్వినా నీరు రాకపోవడంతో ఉసూరుమంటున్నారు. పచ్చగా కళకళలాడాల్సిజూ పొలాలు పశువులకు మేతగా మారడంతో బావురుమంటున్నారు.

-చేగుంట



నార్సింగ్ మండలం నర్సంపల్లిలో పశువులకు మేతగా మారిన వరి



చేగుంట మండలం అనంతసాగర్‌లో ఎండిపోయిన వరి పొలం



నార్సింగ్ మండలం నర్సంపల్లి తండాలో ఎండిన మొక్కజొన్న పంట

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య 7లో



నార్సింగ్‌లో పంటను కపాడుకోవడానికి ఓ రైతు భగీరథ ప్రయత్నం



షెడ్యూల్‌లో ఉన్నా.. వెలువడని
ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్!

- 12న ప్రదర్శిస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటన
- డీఎంహెచ్‌వో ఆఫీసుకు తరలివచ్చిన దరఖాస్తుదారులు
- వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై అభ్యర్థుల ఆగ్రహం

సంగారెడ్డి అర్బన్, మార్చి 12 : సంగారెడ్డి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన మెరిట్‌లిస్ట్ ప్రదర్శనలో జాప్యంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం మంగళవారం మెరిట్‌లిస్ట్‌ను ప్రదర్శించాల్సి ఉన్నా.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎలాంటి లిస్టును విడుదల చేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

97 పోస్టులకు 3వేల దరఖాస్తులు

జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటన చేశారు. ఇందులో భాగంగా గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 1 వరకు దరఖాస్తులను స్వీకరించారు. నిర్ణయించిన సమయంలో 97 పోస్టులకు 3 వేల వరకు దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. నియామక షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన స్క్రూటినీ చేసి, 12వ తేదీన ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేసి, అదే రోజు అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. కానీ మంగళవారం సాయంత్రం 5.30 గంటల వరకు డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీసు బోర్డుపైకానీ, జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్‌లోని ప్రొవిజనల్ మెటిట్ లిస్టును విడుదల చేయలేదు. ప్రొవిజనల్ జాబితా విడుదల చేస్తారని జిల్లా నలుమూలల నుంచి చాలామంది దరఖాస్తుదారులు డీఎంహెచ్‌వో ఆఫీసుకు తరలివచ్చారు. కానీ పొద్దుపోయినా ఎలాంటి జాబితా విడుదల చేయకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. దీంతో, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తీరుపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాబితాను ఇంకా పూర్తిస్థాయిలో రూపొందించలేదని డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పేర్కొంటున్నారని, అలాంటప్పుడు ముందస్తు షెడ్యూల్ ప్రకటించడమెందుకని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. నేడో, రేపో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ వస్తే నియామకాలు ఆగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం జాబితా విడుదల చేయకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కావాలనే జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ స్పందించాలని వారు కోరుతున్నారు.

అంగన్‌వాడీ.. వేడి..!
సెంటర్లలో బయోమెట్రిక్ హాజరు, సీసీ కెమెరాలు

- స్వాగతిస్తున్న తల్లిదండ్రులు
- అవమానిస్తున్నారంటున్న అంగన్‌వాడీ టీచర్లు

మెదక్ అర్బన్, మార్చి 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీల్లో సీసీకెమెరాలు, బయోమెట్రిక్ హాజరు వల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సి పోషకాహారం పక్కదారి పట్టవని చిన్నారుల తల్లిదండ్రులు అంటున్నారు. అయితే, ఈ నిర్ణయం తమను అవమానించడమేనని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ఆందోళనలు చేస్తున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 1,076 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 358 సొంత భవనాల్లో, 335 అద్దె భవనాల్లో, 383 ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటి పరిధిలో 49,153 మంది చిన్నారులు, 6,115 మంది గర్భిణులు, 6,298 మంది బాలింతలకు పాలు, గుడ్లు, పోషకాహారాన్ని అందజేస్తున్నారు.

సరుకులు పక్కదారి

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులు చాలాచోట్ల పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. అలాగే, చాలా కేంద్రాల్లో సిబ్బంది విధులకు సరిగ్గా హాజరుకావడం లేదని, చిన్నారులు రాకుండానే వచ్చినట్టు రికార్డుల్లో పేర్కొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సర్కారు అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు, సీసీకెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. మహిళాభివృద్ధి, సంక్షేమశాఖలపై సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఈమేరకు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. సీఎం ఆదేశాలతో అంగన్‌వాడీల్లో నిఘా పటిష్ఠం చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో సీసీకెమెరాలు, బయోమెట్రిక్ హాజరు ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. త్వరలోనే ఆదేశాలు వెలువడే అవకాశమున్నది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీ టీచర్లు ఆందోళనకు దిగారు.



ఆదేశాలు రాగానే అమలు చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాల ఏర్పాటుపై ఇప్పటికే జూమ్ సమావేశం జరిగింది. రెండు, మూడు రోజుల్లో మార్గదర్శకాలు వస్తాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పక్కగా అమలు చేస్తాం. బయోమెట్రిక్ విధానం బాగుంటుంది. సీసీ ఏర్పాటుతో నిరంతర పర్యవేక్షణ జరుగుతుంది.

-బ్రహ్మాజీ, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మెదక్

సీసీ కెమెరాల ఏర్పాటు.. అవమానించడమే
కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

మెదక్ అర్బన్, మార్చి 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ... మంగళవారం మెదక్‌లోని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ బయోమెట్రిక్, సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల్లో ఒంటిపూట అమలు చేయాలని, మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేష్‌తో, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ పద్మజకు వినతిపత్రం అందజేశారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టడం సిబ్బందిని అవమానించడమేనని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ అమలును విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. 24 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, లేదనంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, మంగ, యేసుమణి తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



గుమ్మడిదల గ్రూపునకు సీఎం అభినందన

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన మనిషా డ్వాక్రా గ్రూప్ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాదులోని జింఖానాగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మహిళాశక్తి సదస్సులో గ్రామానికి చెందిన మనిషా గ్రూప్ సభ్యులు దొంతిరెడ్డి ఝాన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సీఎం సందర్శించారు. వారు తయారుచేసిన ఎంబ్రాయిడరీ దుస్తులు, కళాఖండాలను పరిశీలించి ప్రశంసించారు. ఎంబ్రాయిడరీతో తయారుచేసిన సీఎం చిత్రపటాన్ని గ్రూపు సభ్యులు ఆయనకు అందజేశారు.

-గుమ్మడిదల

సఫాయి కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్
జాతీయ సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ చైర్మన్ వావాజీ



సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వావాజీ

సంగారెడ్డి రూరల్, మార్చి 12: జిల్లాలో అర్హులైన సఫాయి కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ పీపీ.వావాజీ తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సఫాయి కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవుట్‌సోర్సింగ్ ద్వారా సకాలంలో వేతనాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని సఫాయి కార్మికులందరితో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు పొందేందుకు దరఖాస్తులు చేయించాలని పేర్కొన్నారు. కార్మికులందరికీ ఐడెంటిటీ కార్డులు అందజేయాలని, మూడు నెలలకోసారి విధిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా చెల్లించాలని, సఫాయి కర్మచారుల కారుణ్య నియామకాలను పెండింగ్‌లో ఉంచవద్దని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల వివరాలు కమిషన్‌కు వెంటనే అందించాలని, ఆ కేసుల్లో త్వరగా న్యాయం జరిగే జిల్లా చూడాలని పేర్కొన్నారు. సపోర్టింగ్ స్కీంల ద్వారా కార్మికులకు రుణాలు అందించాలని, టాయిలెట్ కాంట్రాక్టుల్లో కార్మికుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పీఎం అవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, గృహలక్ష్మి పథకాల్లో సఫాయి కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చాలని వావాజీ అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను ఆయన సందర్శించారు. సఫాయి కార్మికుల సలహాదారుడు గిరేందర్‌నాథ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి రామాచారి, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జై హన్మంతరావు

16న జోగిపేటలో
మెగా లోక్‌అదాలత్
జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు

జోగిపేట, మార్చి 12: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం లభిస్తుందని జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి జై హన్మంతరావు పేర్కొన్నారు. జోగిపేటలో ఈ నెల 16న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోని కేసులను లోక్ అదాలత్‌లలో పరిష్కారిస్తారని వివరించారు. ఇక్కడ రాజీ అయిన కేసుపై తదుపరి అప్పీలుకు అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాజీ పడదగిన కేసులను లోక్‌అదాలత్‌కు తీసుకు రావాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాతిగౌడ్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ అరుణ్‌గౌడ్, ఏజీపీ వర్మ, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఘటనపై విచారణ

వెల్దుర్తి, మార్చి 12 : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి అర్ధరాత్రి పీహెచ్‌సీ వరండాలోనే ప్రసవించిన ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మెటర్నరీ హెల్త్ పీవో డా.విజయనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణశ్రీ మంగళవారం వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ విధులు నిర్వహించాల్సిన స్టాఫ్‌నర్స్‌లు వారాంతపు సెలవులో ఉండడంతో ఏఎన్ఎంను విధులు నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. ఏఎన్ఎం జయంతి ఆదివారం రాత్రి విధుల్లో ఉండగా.. 11.30 గంటలైనా అటెండర్ రాకపోవడంతో ఒక్కరే ఆసుపత్రిలో ఉండలేక భర్తకు ఫోన్ చేసి పిలిచిందని, ఆయన వచ్చే వరకు సమీపంలో ఉన్న మరో ఏఎన్ఎం ఇంట్లో ఉన్నదని తెలియజేశారు. అదే సమయంలో పురిటి నొప్పులతో గర్భిణి రావడంతో దవాఖానకు వచ్చి లేబర్‌రూంకు తరలిస్తుండగానే ఆవరణలో ప్రసవించిందని తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వారు తెలిపారు. రాత్రివేళ మహిళా ఉద్యోగులు ఒక్కరే ఉండాలంటే ఇబ్బందిగా ఉందని సిబ్బంది తమ దృష్టికితీసుకరావడంతో ఇద్దరు ఉండేలా షెడ్యూల్ రూపొందించామని పేర్కొన్నారు. దవాఖానలో సిబ్బంది కోసం గ్రామ పంచాయతీ నుంచి తార్మానం చేయల్సిందిగా కోరినట్టు తెలిపారు.



సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

విద్యార్థులు మూఢవిశ్వాసాలు వీడాలి: ఎస్ఐ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతి

కోహెడ, మార్చి 12: సైన్స్‌తో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని, విద్యార్థులు మూఢవిశ్వాసాలు వీడాలని ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు. మంగళవారం కోహెడ మండల కేంద్రంలోని తంగళ్లపల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్య అవశ్యకత - మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఐ తిరుపతి హాజరై మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు వీడకపోవడం దురదృష్టకరమన్నారు. స్త్రీ విద్యతో దేశాభివృద్ధి సాధ్యమని, విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా ఆర్థిక మోసం చేస్తున్నారన్నారు. సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయకమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ దయ్యాలు, భూతాలు బూటకమని. సైన్స్ ఆధారంగా విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం లాంటి ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గజ్వేల్, మార్చి 12: చట్టాలపై విద్యార్థులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా సూచించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో, గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్‌హబ్‌లో గల బాలికల పాఠశాల్లో విద్యార్థులకు బాలికలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గుడ్, బ్యాడ్ టచ్, మహిళల చట్టానికి గల చట్టాలు తదితర అంశాలను గూర్చి వివరించారు. తల్లిదండ్రుల కష్టాల్ని గుర్తుంచుకుని ఇష్టపడి చదువుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులు క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలన్నారు. పోక్సో, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను అవసరమైన మేరకే వినియోగించుకోవాలని, అనవసరంగా ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. వారితో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించడం సంతోషం

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానించిన ఉత్సవ కమిటీసభ్యులు, తదితరులు

జహీరాబాద్, మార్చి 12: జహీరాబాద్ పట్టణంలోని శివాలయం సమీపంలో నాగదేవత ఆలయంలో 1008 నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించడం సంతోషకరమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పరిశీలించి విగ్రహాలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో పెద్దఎత్తున నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠించడంపై ఉత్సవకమిటీ సభ్యుల పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు మహంకాల్ సుభాష్, వెంకటేశం, ఉత్సవకమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజుకు నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన

జహీరాబాద్ పట్టణంలోని కైలాసగిరి శివాలయం వద్ద 1008 నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఆలయ ప్రాంతంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాశీజగద్గురుస్వామి, శ్రీశైలం ప్రధాన అర్చకులు, ఉత్సవకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, మార్చి 12: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన మహిళా సదస్సుల్లో పాల్గొనడానికి ఖేడ్ డివిజన్ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలు పలు బస్సుల్లో తరలివెళ్లగా ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను సాగనంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల్లోని మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ గృహాలను మహిళల పేరిట మంజూరు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసి మహిళలకు అన్యాయం చేసిందని తెలిపారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళల పేరిట ఇందిరమ్మ గృహాల మంజూరును పునరుద్ధరించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, నర్సింహులు, మాజీద్, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, తామేర్‌అలీ, శంకర్ ముదిరాజ్, కిషన్ నాయక్‌రాథోడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి, ఉత్తులూరు, శివాయపల్లి, దానంపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బూర్గుపల్లి కోటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు, పేట మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మూసాపేట, ఎంపీటీసీ రాజునాయక్, నాయకులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో జెండా ఊపి బస్సులను సాగనంపుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

ప్రభుత్వ పాఠశాలలను పరిశ్రమలు దత్తత తీసుకోవాలి

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం, మార్చి 12: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యనందించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు పరిశ్రమల యాజమాన్యాలు తమవంతు తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ మార్క్సునగర్‌లో ప్యారగాన్ పరిశ్రమ సౌజన్యంతో రూ.1.30 కోట్ల నిధులను వెచ్చించి నిర్మించిన రెండతస్తుల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో వందలాది పెద్దపెద్ద పరిశ్రమలు ఉన్నందున ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చి దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎక్కువగా పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకునే పాఠశాలలను కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో ముందడుగు వేస్తున్నామని చెప్పారు. పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటుకు సొంతంగా నిధులు ఇస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్, గోపాల్, పరిశ్రమ డైరెక్టర్ సిద్ధార్థ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిన్నారం మండలం వావిలాలలో రూ.40 లక్షలు, అండూరులో రూ.20 లక్షలతో చేపట్టనున్న బ్రిడ్జి పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీటీసీలు వెంకటేశంగౌడ్, స్వాతి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బండ్లగూడ మార్క్సునగర్‌లో పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

మూడు బోర్లు వేసి అప్పుల పాలై..

● ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

చేగుంట, మార్చి 12: తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పంట పొట్ట దశలో ఉన్న తరుణంలో నీరు లేక ఎండిపోతుండటంతో తట్టుకోలేక.. అప్పుచేసి మూడు బోర్లు వేశాడు. అయినా, చుక్కనీరు రాకపోవడం.. అప్పుల పాలు కావడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని కిష్టాపూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన కుర్మ స్వామి(30) తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగు కోసం సుమారు నాలుగు లక్షల అప్పు అయింది. అయినా, పంట ఎండిపోయింది. మనస్తాపం చెందిన స్వామి మంగళవారం పొలానికి వెళ్లి అక్కడే వేపచెట్టుకు తాడుతో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కుర్మ మౌనిక ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై బాల్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీ డబ్బుల విషయంలో గొడవ, మహిళ ఆత్మహత్య



కళమ్మ మృతదేహం

చేగుంట, మార్చి 12: చిట్టీ డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో.. మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్య చేసుకున్నది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొయినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మండలం భీమ్రావుపల్లి గ్రామానికి చెందిన ఇప్పకింది కళమ్మ(40)కు భర్త రాములుతో చిట్టీ డబ్బుల విషయంలో సోమవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన కళమ్మ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. భర్త రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

రామాయంపేట, మార్చి 12: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన డబుల్ బెడ్‌రూం కాలనీలో జరిగింది. కాలనీలో నివసించే సాదుల నర్సింహులు(35) ఈ నెల 9న భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోగా.. మనస్తాపం చెందిన నర్సింహులు.. అదేరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను చనిపోయి మూడురోజులు కావడంతో దుర్వాసన రాగా.. మంగళవారం తలుపులు బద్దలు కొట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాపన్నపేట, మార్చి 12: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్లంపేటకు చెందిన పోచయ్య(46) ఈనెల 8న రాత్రి ఇంటి బయట ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు కిందపడగా తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నశంకరంపేటలో బాలుడు...

చిన్నశంకరంపేట, మార్చి 12: చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. చిన్నశంకరంపేట మండలం మడూర్ గ్రామానికి చెందిన చాకలి రేణుక, సురేష్ దంపతుల కుమారుడు మోక్ష(12) వారంరోజుల క్రితం గ్రామ శివారు చెరువులోకి బట్టలు ఉతకడానికి వెళ్లాడు. చేతులు శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. గమనించిన స్థానికులు మోక్షను బయటకు తీశారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండడంతో చికిత్స నిమిత్తం నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

బొంతపల్లిలో యువకుడి అదృశ్యం

గుమ్మడిదల, మార్చి 12: ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జహంగీర్ ఈనెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇప్పటివరకూ రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య రేష్మాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దొంగతనానికి యత్నించిన ఇద్దరికి దేహశుద్ధి

కౌడిపల్లి, మార్చి 12: దొంగతనం చేసేందుకు వచ్చి బైక్ టైర్లను విప్పుతున్న ఇద్దరిని పట్టుకుని స్తంభానికి కట్టేసిన సంఘటన మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గేట్ సమీపంలో మంగళవారం చోటు చేసుకున్నది. ఇదే మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వడ్ల సాయిలు, చాకలి శంకర్ కటింగ్ ప్లేయర్, పానాలు పట్టుకుని అటూ ఇటూ అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు ఎవరని అడగ్గా.. ఎదురు ప్రశ్నించగా పట్టించుకోలేదు. కాగా వెంకట్రావ్‌పేట్‌లో బైక్ టైర్లు విప్పుతుండగా పట్టుకుని జాతీయ రహదారి దగ్గర ఉన్న స్తంభానికి కట్టేశారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రైతుల సమస్యలు పరిష్కరించే పార్టీకే మా ఓటు

● రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు

సంగారెడ్డి రూరల్, మార్చి 12 : రైతుల సమస్యలు పరిష్కరించే పార్టీకే మా ఓటు వేస్తామని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు స్పష్టం చేశారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 50 శాతం పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలను అన్ని పార్టీలు ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నాయని విమర్శించారు. సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

నారాయణఖేడ్, మార్చి 12: సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తతతో ఉంటూ విధులు నిర్వహించాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో సరిహద్దు పోలీసు అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్కి డీఎస్పీ శివానంద్, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఔరాద్ సీఐ రఘువీర్, బీదర్ జిల్లా ఎక్సైజ్ అధికారులతోపాటు స్థానిక ఎస్‌ఐలు విద్యాచరణ్‌రెడ్డి, అమిర్యానాయక్, సిద్ధిరాములతోపాటు కర్ణాటకలోని జన్‌వాడ, చింతాకి, సంత్‌పూర్ ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, మార్చి 12: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఇంటర్ సెకండియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 17,223 మందికి 16,757 మంది హాజరుకాగా, 466 మంది గైర్హాజరయ్యారు. 97.29 హాజరు శాతం నమోదైంది. కాగా సంగారెడ్డి జిల్లాలోని శ్రీఅక్షయ, ఎస్‌వీ, ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తనిఖీ చేశారు.

పాత బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ కనెక్షన్ తొలగింపు

హత్నూర, మార్చి 12: హత్నూర మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన చిత్తారి సిద్ధయ్య 12 ఏళ్ల క్రితం మృతిచెందాడు. గ్రామంలోని ఆయన నివాస గృహానికి విద్యుత్ మీటర్ లేకపోయినా... బిల్లు మాత్రం ప్రతినెలా వస్తూనే ఉన్నది. అయితే ఆయన మృతిచెంది 12 ఏళ్లు కావస్తుండడంతో ఏడాదిగా ఆయన కుటుంబీకులు మీటర్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. అధికారులు ఇవ్వకపోగా.. ప్రతినెలా బిల్లు మాత్రం చేతిలో పెట్టి వెళ్తున్నారు. కొత్త మీటరు మంజూరు చేస్తే అప్పటికప్పుడు బిల్లు చెల్లిస్తామని కుటుంబీకులు మొరపెట్టుకున్నా.. విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు 200 యూనిట్ల విద్యుత్ గృహ అవసరాలకు ఉచితంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేసి అమలు చేస్తున్నప్పటికీ ముచ్చర్ల గ్రామంలో మాత్రం ఆ కుటుంబానికి మంగళవారంవిద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో కెరీర్‌పై అవగాహన

పుల్‌కల్, మార్చి 12: చౌటకూర్ మండలం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల ద్వితీయ సంవత్సరం, చివరి సంవత్సరం విద్యార్థులకు మాంక్ క్యాపిటల్ సహకారంతో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ యుగంలో కెరీర్, వ్యవస్థాపకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాంక్ క్యాపిటల్ సహ వ్యవస్థాపకుడు శరత్ కొణతం, విక్రం కల్వకుంట్ల హాజరయ్యారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు.

సమాచారం

కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు

మెదక్ అర్బన్: జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొల్చారం రైతువేదికలో 'రైతునేస్తం'

కొల్చారం: కొల్చారం రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మామిడి పూత రాలడం, వేసవికాలంలో పంటల రక్షణ కోసం తీసుకోవాల్సిన పద్ధతులు, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.

అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడులు

మునిపల్లి: అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతి ద్వారా మొక్కలు నాటితే అధిక దిగుబడులు వస్తాయని సంగుపేట డాట్‌సెంటర్ సమన్వయ కర్త కే.రాహుల్ విశ్వకర్మ, శాస్త్రవేత్త సరిత అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లి రైతువేదికలో స్పెషల్ కాటన్ ప్రాజెక్టు ద్వారా పత్తిలో అధిక సాంద్రత పద్ధతిపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

18న తైబజార్ వేలం

తూప్రాన్: తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధి తైబాజార్ వేలం 18న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినోద్దీన్ తెలిపారు. 2024-25 సంవత్సరానికిగానూ తైబజార్, పశువుల సంతలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సరైన సమయంలో డిపాజిట్ చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని సూచించారు.

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడి ఎన్నిక

మనోహరాబాద్: బీఆర్ఎస్ కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడిని మాజీ సర్పంచ్ రాజుయాదవ్, మాజీ అధ్యక్షుడు శ్రీధర్ చారి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీర్ల ఇంద్రసేన యాదవ్, యూత్ అధ్యక్షుడిగా ఏషం నాగరాజు ఎంపికయ్యారు.

తూప్రాన్‌లో హనుమాన్ మాలధారణ దీక్షలు

తూప్రాన్: తూప్రాన్ పట్టణ పెద్ద చెరువు కట్టపై వెలసిన శ్రీవీరాంజనేయ ఆలయం వద్ద మంగళవారం హనుమాన్ దీక్షలు ప్రారంభమయ్యాయి. మూడున్నర దశాబ్దాలుగా దీక్షలు చేపడుతున్నారు. ఆలయ వ్యవస్థాపక పూజారి శలాక ఆత్రేయశర్మ ఆధ్వర్యంలో 41 రోజుల మండల హన్‌మత్ దీక్షలు చేపట్టారు. మంగళవారం 70 మంది భక్తులు హనుమాన్ మాలధారణ దీక్షలు తీసుకున్నారు.

ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తాం: హనుమంతరావు

చిన్నశంకరంపేట, మార్చి 12: ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని రామాయపల్లి గ్రామంలో ఎమ్ఎస్ఎస్‌వో ద్వారా తల్లిదండ్రులు లేని పిల్లల పేరుతో రూ.25 వేలు బ్యాంకు డిపాజిట్ బుక్కులను బాధిత కుటుంబీకులకు అందజేసి మాట్లాడారు. మైనంపల్లి కుటుంబం పేదలకు అండగా ఉంటుందన్నారు. ప్రజలకు ఏకష్టమచ్చిన తమ కష్టంగా భావిస్తామన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో గ్రామాలాభివృద్ధికి తమవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుభ్రబాతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీమాన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్, మాజీ ఎంపీపీ అరుణ పాల్గొన్నారు.



ఫిక్స్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు

విద్యావిధానాన్ని వ్యాపారంగా మార్చేసిన కేంద్రం

● జిల్లా కమిటీ సదస్సులో వక్తలు

సంగారెడ్డి రూరల్, మార్చి 12: కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి వ్యాపారంగా మార్చేసిందని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగరాజు, వెంకటేశ్ ఆరోపించారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని పదేళ్లయినా అమలు చేయలేదని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీజేపీ పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కుల, మతాల పేరుతో రాజకీయం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, లేకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, రమేష్, మాజీ అధ్యక్షుడు మాణిక్యం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షుడు సతీష్, బాలికల కన్వీనర్ వాణి, కో కన్వీనర్ సాక్షి, నాయకులు రవికిరణ్‌గౌడ్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

ఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.20 కోట్లు

● సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

నారాయణఖేడ్, మార్చి 12: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.20 కోట్లు మంజూరు చేసినందుకుగాను మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇందులో కౌన్సిలర్లు వివేకానంద్, నర్సింహులు, మాజీద్, సద్దాం, మూఢ రామకృష్ణ, హన్మాండ్లు పాల్గొన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని మసీదుల వద్ద నీటి వసతి, పారిశుధ్య, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారంశంకర్, కమిషనర్ జగ్జీవన్‌కు సూచించారు.



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు

జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి

వట్‌పల్లి, మార్చి 12: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోతులబోగూడలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విబేధాలు పక్కనబెట్టి సమష్టిగా కృషిచేసి జహీరాబాద్‌లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వినోద్‌గౌడ్, నాయకులు వీరారెడ్డి, బసవరాజ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

● డీఈవో రాధాకిషన్



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

శివ్వంపేట, మార్చి 12: ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైనదని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 2023లో ప్రతిభ కనబరిచిన 22 మంది ప్రథమ, ద్వితీయస్థాయి విద్యార్థులకు డీఈవో రాధాకిషన్ చేతుల మీదుగా మెడల్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్యానాయక్, హెచ్ఎం రవి, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ మంజుల, మాజీ సర్పంచ్ పని శశాంక్, వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.

అద్దెలకు అసైన్డ్ భూములు!

నర్సాపూర్, మార్చి 12: చాలా ఏళ్ల క్రితం సాగుచేసుకోవడానికి అసైన్డ్ భూములు పొందినవారు నేడు ఆ భూములను వాణిజ్య అవసరాలకు అద్దెలకు ఇస్తుండటంతో రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. నర్సాపూర్-మెదక్ జాతీయ రహదారికి ఆనుకుని పట్టణ సమీపంలో సర్వే నెంబరు 731లో అసైన్డ్ భూములు ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన కొందరు అసైన్డ్ భూములను చదును చేసి నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందికి నోటీసులు జారీ చేసినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారు 15 రోజుల్లో ఈ విషయమై తగిన సమాధానమివ్వాలని, లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.

అక్రమ సిగరెట్ అమ్మకాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

సంగారెడ్డి క్రైమ్, మార్చి 12: ప్రభుత్వం నిషేధించిన సిగరెట్లను ఇద్దరిని జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి పట్టణంలోని కింగ్స్ పాన్ మహల్, పెగ్స్ అండ్ మగ్స్ పాన్ షాప్‌లపై దాడులు నిర్వహించి, నిషేధిత 72 సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలోని నాల్సాబ్‌గడ్డకు చెందిన మహ్మద్ సలీం పాష(30), మహ్మద్ ఇర్ఫాన్(21)లను అదుపులోకి తీసుకున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. అలాగే కంది మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ శివారులో గల నక్కవాగులో కొనసాగుతున్న అక్రమ కృత్రిమ ఇసుక తయారీ కేంద్రంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇసుక ఫిల్టర్ నిర్వాహకుడు ఇస్మాయిల్‌ఖాన్‌పేటకు చెందిన వెండికోల్ వీరేశం, ఎర్దనూర్‌కు చెందిన వడ్డె నారాయణ, ఎర్దనూర్‌తండాకు చెందిన నినావత్ రాజు, డ్రైవర్ రాము, ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. 2 ట్రాక్టర్లను, ఇక ఇటాచిని సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు.

సంగారెడ్డిలో కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వే

సంగారెడ్డి అర్బన్, మార్చి 12: సంగారెడ్డి పట్టణంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వే మంగళవారం నిర్వహించారు. లెప్రసీ విభాగం డీపీఎంవో కె.మారుతి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ స్పర్శలేని మచ్చలున్నాయా? లేవా అంటూ ఆరాతీశారు. శరీరంపై తెల్ల మచ్చలు, రాగి వర్ణపు మచ్చలు, స్పర్శలేని మచ్చలు, చర్మం రంగు మారడం, మొద్దుబారిపోవడం, స్పర్శ తెలియకపోవడం లాంటి సమస్యలను పరిశీలించారు. ఆయన వెంట మార్క్సునగర్ మెడికల్ ఆఫీసర్ డా.శశికర్, సిబ్బంది ఉన్నారు.

'ఎన్‌హెచ్‌ఎం'లకు వేతనాలు చెల్లించండి

● డీఎంహెచ్‌వోకు సీఐటీయూ మెడికల్ యూనియన్ వినతి

సంగారెడ్డి అర్బన్, మార్చి 12: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ మూడునెలలుగా వేతనాలు రాక ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తద్వారా కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి బ్రాంచ్ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి వినోద్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

పెద్దశంకరంపేట, మార్చి 12: పెద్దశంకరంపేట పట్టణ శివారులో కట్టమైసమ్మ గురుపాద శివాలయం ఆవరణలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వేదమంత్రోశ్ఛరణల మధ్య మంగళవారం వైభవంగా నిర్వహించారు. పలువురు గ్రామ పెద్దలు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా శివాలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త బలరాం, సంగమేశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, గుజ్జరి కనకరాజు, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేట: గురుపాదగుట్ట ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా మూలమంత్ర విగ్రహ హోమం

హవేళిఘణపూర్, మార్చి 12: మండలంలోని కూచన్‌పల్లిలోని హనుమాన్ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం విగ్రహదాతలు, వేదపండితుల సమక్షంలో మూలమంత్ర విగ్రహ హోమం నిర్వహించారు. మూడురోజులపాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు వేణుశర్మ, గ్రామ పెద్దలు రామకృష్ణ, సుభాష్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

చిన్నశంకరంపేట, మార్చి 12: మహా శివరాత్రి వేడుకలను పురష్కరించుకుని చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని చండికాంబ సమేత సోమేశ్వరుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రథోత్సవాన్ని నిర్వహించారు. రథంపై స్వామివార్ల విగ్రహాలను ఉంచి రథోత్సవాన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాజిరెడ్డి, శ్రీమాన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.